TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక :08 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.02.08.2025 పేజీలు : 8, వెల:రూ.1.00

## జనవరి నుంచి వైటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి



దామరచర్ల : అమృత్ తెలంగాణ: డిసెంబర్ వరకు యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లోని అన్ని యూనిట్లనూ పూర్తిచేసి 2026 జనవరి నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తెలిపారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన స్టేజ్–1లోని ఒకటో యూనిట్‌ను శుక్రవారం జాతికి అంకితం చేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి రూ.970 కోట్లతో వైటీపీఎస్ ఆవరణలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పనులకు శంకుస్థాపన చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం వైటీపీఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. నిర్దేశించిన సమయంలోగా అన్ని యూనిట్ల ద్వారా విద్యుత్ అందించేందుకు వైటీపీఎస్ అధికారులు ప్రాధాన్యత క్రమంలో పనులను విభజించుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. ఏడాది కాలంలోనే స్టేజ్–1లోని రెండు యూనిట్లను పూర్తి చేసి విద్యుత్ అందించడం పట్ల వైటీపీఎస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల, ఆస్పత్రులు నిర్మించి పరిసర ప్రాంతాల ప్రజలకు మేలు జరిగేలా చూడాలని చెప్పారు. పవర్ ప్లాంట్ ఆవరణలో డీఏవీ పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు అధికారులు ఆయన దృష్టికి తీసుకురాగా.. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను పవర్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి, అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. బొగ్గు లారీలు, బూడిద లారీలతో రోడ్లు దెబ్బతిన్న కారణంగా.. యుద్ధ ప్రాతిపదికన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, ఇందుకు సంబంధించి నష్టపరిహారం, భూసేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలోనే విష్ణుపురం డబుల్ రైల్వే లైన్ మంజూరైందని, అయితే ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కేంద్రాన్ని కోరారు. 93 కిలోమీటర్ల డబుల్ లైన్ రైల్వే పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన నిధులు రానందున ఆలస్యం అవుతున్నట్టు తెలిపారు. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రహదారుల పూర్తికి రూ.280 కోట్లు మంజూరు చేయడమే కాక క్లియరెన్స్ ఇచ్చినట్టు తెలిపారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రవర్‌ప్రాజెక్టు ఏర్పాటు చేసినప్పటికీ సామాజిక బాధ్యతగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రాజెక్టు నుంచి ఎలాంటి సహకారమూ అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డికి 'కాళేశ్వరం' నివేదిక




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ నివేదికను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి మంత్రులు పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సమర్పించారు. కాళేశ్వరం బ్యారేజీల్లో అవకతవకలు, అవినీతి, ఇతర అంశాలపై జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ చేసిన సంగతి తెలిసిందే. సంబంధిత నివేదికను గురువారం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు చైర్మన్ ఘోష్ అందజేశారు. ఆ నివేదిక శుక్రవారం సీఎంకు చేరింది. ఈ సందర్భంగా నివేదికపై సీఎం రేవంత్ రెడ్డితో మంత్రులు, సీఎస్ రామకృష్ణారావు సమగ్రంగా చర్చించారు.

అధ్యయనానికి కమిటీ

కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి చర్యలకు సిఫారసు చేసేందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో నీటిపారుదల శాఖ కార్యదర్శి, జీఏడీ కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శిని సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి నియమించారు. పూర్తిస్థాయి పరిశీలన అనంతరం ఈ నెల 4న ప్రభుత్వానికి యాక్షన్ రిపోర్టును సమర్పిస్తారు. క్యాబినెట్‌లో ఈ విషయమై చర్చించి సారాంశాన్ని క్యాబినెట్‌కు తెలియజేశారు. అక్కడ మంత్రుల అభిప్రాయాలు, చట్టం, నీటిపారుదల శాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం. బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ షమీమ్ అక్తర్ నివేదికపై అధ్యయనం చేసిన అనంతరమే అసెంబ్లీలో బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపారు. ఇప్పుడు కాళేశ్వరం నివేదిక విషయంలోనూ రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించిన అనంతరం అసెంబ్లీలోనూ చర్చకు పెట్టే అవకాశం ఉంది. అప్పుడు నివేదికలోని సారాంశం ఆధారంగా ఐఏఎస్‌లతో కూడిన త్రిసభ్య కమిటీ చేసే సిఫారసులను చర్యల రూపంలోకి మార్చాలని ప్రభుత్వం భావిస్తున్నది.

అన్ని రకాల వైఫల్యాలు

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు జరిగాయనీ, దీనికి కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు పలువురు కారణమని పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో స్పష్టం చేసినట్టు తెలిసింది. వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్టానుసారం ప్రాజెక్టు పనులు జరిగాయనీ, ఉన్నతస్థాయిలో వచ్చిన ఒత్తిడికి మార్గదర్శ కాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారని నివేదికలో తెలిపినట్టు సమాచారం. ఆర్థిక అవకతవకలు జరిగాయనీ, ఇలా పలు అంశాలను కాళేశ్వరం న్యాయ విచారణ నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి డీపీఆర్ తయారీ మొదలుకొని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీల వరకు ఎప్పుడు ఏం జరిగిందనే విషయాలను రికార్డుల ఆధారంగా ఎక్కడ, ఎవరు బాధ్యులన్నది వివరంగా నివేదికలో తెలియజేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.

ఆ మేరకే చర్యలు


పీసీ ఘోష్ నివేదికను 650 పేజీలతో సమర్పించారు. ఇందులో ఘోష్ కమిషన్ అంశాల వారీగా బాధ్యులు ఎవరనే సంగతులను కూడా నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. ఒత్తిడికి లొంగి వ్యవస్థల నిబంధనల ప్రకారం కాకుండా వ్యక్తుల ఇష్టానుసారం కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలను నిర్మించారనీ, కనీస మార్గదర్శకాలను పట్టించుకోలేదని నివేదికలో పేర్కొన్నారనే ప్రచారం జలసౌధలో జరుగుతున్నది. ఇప్పటికే దాదాపు 40 మందికి పైగా అధికారులను గుర్తించారు. వాళ్లపై చర్యలు సైతం తీసుకున్నారు. ఇప్పుడిక పూర్తిస్థాయి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఒకవేళ గత ప్రభుత్వంలోని కీలక నేతలను రేవంత్ సర్కారు కేసులు పెట్టి అరెస్ట్ చేస్తే, రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకునే అవకాశం కల్పిస్తున్నది.

## అదానీ, అంబానీ కోసమే మోడీ ప్రభుత్వం పనిచేస్తుంది



జోగిపేట :అమృత్ తెలంగాణ: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ కోసమే పని చేస్తున్నదని రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర శుక్రవారం రెండవ రోజు సంగారెడ్డి జిల్లాకు చేరుకుంది. జిల్లాలోని అందోల్ నియోజకవర్గం సంగుపేట చౌరస్తా నుంచి జోగిపేట వరకు పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, జి.వివేక్ వెంకటస్వామితో కలిసి ఆమె పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. బీహార్‌లో పేదల ఓట్లు తొలగిస్తున్నారని, వారు ఓటు హక్కు వినియోగించుకోవద్దా అని మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశంలో రెండు రకాల మోడల్స్ ఉన్నాయని, ఒకటి తెలంగాణ మోడల్, రెండోది విద్వేష మోడల్ అని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనతో అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నట్టు చెప్పారు. సామాజిక న్యాయం దిశగా పని చేస్తోందని, ఇది రాహుల్‌గాంధీ మోడల్ అని తెలిపారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 100 సీట్లు కచ్చితంగా గెలుస్తామన్నారు. ఇందిరాగాంధీ, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు గాంధీ కుటుంబం నుంచి వచ్చిన మీనాక్షి గాంధీ మనకు అండగా ఉన్నారని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. జోగిపేట ఉద్యమాలకు అడ్డ అని అన్నారు. సింగూరు జలాలు, జేఎన్‌టీయూ, విద్య, వైద్య సదుపాయాల కల్పనలో అందోల్ నియోజకవర్గాన్ని అగ్రభాగాన నిలిపామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలన్నారు. మంత్రి జి వివేక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తోందన్నారు. గ్రామ గ్రామాన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతోనే ఈ పాదయాత్ర చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షట్కార్, మాజీ ఎమ్మెల్యే,పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బనకచర్ల డీపీఆర్‌ను వెనక్కి ఎందుకు పంపారు?



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మిగులు జలాలు అనేవి నిజంగా ఉంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌ను ఎందుకు వెనక్కి తిప్పి పంపాయని ? మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం అథారిటీ, గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీ, ఎన్విరాన్‌మెంట్ సంస్థలు ఎందుకు బనకచర్ల డీపీఆర్‌ను తిరస్కరించాయో చెప్పాలని డిమాండ్ చేశారు. మిగులు జలాలు ఉన్నాయని ఎవరు చెప్పారు? ఉంటే ఏపీకి ఎన్ని, తెలంగాణకు ఎన్ని కేటాయించారో చెప్పాలి? అని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకుల మౌనం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందని తెలిపారు. అప్పటిలాగే నీళ్లు తీసుకుపోతే చూస్తూ ఊరుకునేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుకు వంత పాడుతున్నారని ఆయన ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి లోపాయికారి ఒప్పందం చేసుకున్నందునే ఏపీ మంత్రి లోకేశ్ బనకచర్ల నిర్మించి తీరుతామని చెబుతున్నారని హరీశ్‌రావు వెల్లడించారు. బనకచర్లపై చంద్రబాబు బుల్డోజర్ విధానానికి బీజేపీ, కాంగ్రెస్‌ల మౌనమే కారణమని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఏడుసార్లు ఉత్తరాలు రాస్తే, లోకేశ్ ఎప్పుడూ అడ్డుకోలేదని చెబుతున్నారని తప్పుపట్టారు. తెలంగాణలో రెండు నదులను హస్తగతం చేసుకునే కుట్రలు జరుగుతున్నాయనీ, దీన్ని అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. ఉమ్మడి ఏపీలో తెలంగాణకు 968 టీఎంసీలను తెలంగాణకు వాటాగా కేటాయించారనీ, అయిన ప్పటికీ తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 968 టీఎంసీ పరిధిలో నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకుంటూ కేంద్రానికి రాసిన లేఖలను ఉప సంహరించుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చంద్రబాబుది ప్రాంతీయ విద్వేషమా? : లోకేశ్‌కు హరీశ్‌రావు ప్రశ్న

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బాబ్లీ, ఆల్‌మట్టిపై పోరాడిన చంద్రబాబునాయుడిది ప్రాంతీయ విద్వేషమా? అని ఏపీ మంత్రి లోకేశ్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. గోదావరి నదిలో తెలంగాణ వాటా అడిగితే ప్రాంతీయ విద్వేషాన్ని రెచ్చగొడుతున్నామని తమను విమర్శిస్తున్న లోకేశ్ ముందు చంద్రబాబు గురించి చెప్పాలన్నారు. సుప్రీంకోర్టుకు వెళ్లి అయినా సరే కేసీఆర్, బీఆర్ఎస్ తెలంగాణ హక్కులను కాపాడుతుందని స్పష్టం చేశారు. అనుమతులు తెచ్చుకునే పద్ధతి మీకు తెలిస్తే, ఆపే పద్ధతి కూడా మాకు తెలుసని హెచ్చరించారు. రాష్ట్రానికి చెందిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు , 8 మంది బీజేపీ ఎంపీలు అడ్జర్నమెంట్ మోషన్ ఇచ్చి ఎందుకు బనకచర్ల మీద నిలదీయడం లేదు? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు



ముషీరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం బాధాకం మన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వకపోయినా పర్వాలేదు కానీ విద్యార్థులకు మాత్రం ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చినంక ఖజానా ఖాళీగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం ఎంతవరకు సమంజనమని ప్రశ్నించారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌ను సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్తోందన్నారు. ఒకవైపు ఫీజు బకాయిలు చెల్లించకుండా.. ఇంకో వైపు "ట్రస్ట్ బ్యాంకు" ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని కొత్త నాటకానికి తెరలేపారన్నారు. ఈ ప్రతిపాదన ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.6000 కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. 100 బీసీ కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలని, 119 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని, బీసీ గురుకుల పాఠశాలల్లో 20 శాతం సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. విద్య రాజ్యాంగబద్ధమైన హక్కు అని.. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి ఉపయోగపడే ఈ స్కీమ్‌ను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీరుగారుస్తున్నదని విమర్శించారు. అనేక పథకాలకు లక్షల కోట్ల అప్పు తెస్తున్న ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం రూ.6000 కోట్లు అప్పు తెస్తే ఎవరు అడ్డుకుంటారని ప్రశ్నించారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌కు రూ.20 కూడా విడుదల చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకం అమలుకు ఏటా నాలుగు శాఖల ద్వారా బడ్జెట్‌లో రూ.5000 కోట్ల బడ్జెట్ కేటాయించి కూడా ఒక్క రూపాయి విడుదల చేయకుండా ల్యాప్స్ చేశారన్నారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో రెండు దఫాలుగా రూ.1500 కోట్లు విడుదల చేశారని, మన రాష్ట్రంలో బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వకుళాభరణం కృష్ణమోహన్, నీలా వెంకటేష్, గుజ్జ సత్యం, సుధాకర్, నందగోపాల్, రాందేవ్ మోడీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి మత్తు.. యువత చిత్తు

నల్లగొండ .అమృత్ తెలంగాణ: ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన యువత.. గంజాయి మత్తులో చిత్తవుతోంది. సరదాగా మొదలవుతున్న గంజాయి అలవాటు వ్యసనంగా మారుతోంది. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుని నిషాలో తూగుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. పై చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాల్సిన యువత గంజాయి వినియోగంతో జీవితాలను అగాధంలోకి నెట్టుకుంటోంది. గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రభుత్వం, పోలీసులు చెబుతున్నా వాస్తవరూపం దాల్చడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి భారీగా సరఫరా జరుగుతూనే ఉంది. నల్లగొండ జిల్లాలోని నల్లగొండ పట్టణంలో 2 టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జులై 14న గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తాజాగా.. 1టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరుగురు విద్యార్థులను అదుపులో తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం.

కఠిన చర్యలు తీసుకోక పోవడం వల్లే..

ఎన్డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్ స్టాన్సెస్) చట్టం ప్రకారం.. గంజాయి కిలో అంతకంటే తక్కువ పరిమాణంతో పట్టుబడితే.. ఆ వ్యక్తిని వినియోగదారుగా పరిగణిస్తూ చట్టంలోని 26, 27 తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో నేరాభియోగం తక్కువగా ఉండటంతో బెయిల్ వెంటనే లభిస్తోంది. గంజాయితో పట్టుబడినా పెద్ద సమస్య లేకుండా బయటకు వస్తున్నామని భావించే కొందరు మళ్లీ అడ్డదారులు తొక్కుతున్నారు. కొందరు కళాశాలల విద్యార్థులూ అందులో ఇరుక్కుంటున్నారు.

కమీషన్ల ఎర!

నెట్‌వర్క్ పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్న గంజాయి స్మగ్లర్లు.. సరుకు రవాణా కోసం కమీషన్ల ఆశ చూపి.. అమాయకులను ఈ దందాలోకి లాగుతున్నారు. ప్రధానంగా కళాశాలల విద్యార్థులను అందుకోసం ఎంపిక చేసుకుంటున్నారు.

## ఆదిలాబాద్ లో భార్య కు కోటి రూపాయలకు పైగా భరణం చెల్లించిన భర్త.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ప్రముఖ న్యాయవాది నిఖిలేష్ తోగరి యొక్క క్లయింట్ అయిన స్థానిక సంజయ్ నగర్ కు చెందిన ఒక మహిళ కు ఆమె భర్త నుండి డబ్బు రూపేణ 72 లక్షలు, పిల్లల చదువులు ఇతర ఖర్చుల రూపం లో మరో 70 లక్షల వరకు భరణం చెల్లించాల్సింది గా ఆదిలాబాద్ జిల్లా కోర్టు అవార్డ్ పాస్ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఆ డబ్బును కోర్టులోనే చెల్లించాడు భర్త.. ఈ సందర్భంగా తన క్లయింట్ కి న్యాయం చేసిన జిల్లా న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావ్ కి ప్రత్యేక కృత్ఞతలు తెలిపారు ఆమె తరపు న్యాయవాది నికిలేష్ తోగరి.

## మాలలకు నష్టం వర్గీకరణ

### అదిలాబాద్ జిల్లా మాల సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్



వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : తెలంగాణ లో SC వర్గీకరణ రోస్టర్ అమలులో లో మాల కులస్థులకు తీవ్రమైన అన్యాయం జరగడం ని నిరసిస్తూ రాష్ట్ర శాఖ పిలుపు మేరక ఆగష్టు ఒకటవ తేదీన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ వినతి పత్రం అందించడం జరిగింది ఇందులో ప్రధానంగా వర్గీకరణ లో గ్రూప్ 3 వారికి రోస్టర్ లో తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, పాత నోటిఫికేషన్ లో వర్గీకరణ అమలు చేయకూడదు అని, మాల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమం లో సింగరి అశోక్, రాఘువేంద్ర, స్వామి,మేకల మల్లన్న, గంగన్న, ఉషాన్న, లక్ష్మన్, ప్రభాకర్,రవి, నరేందర్, మొదలగు సభ్యులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ లోని బుద్ధ విహార్లలో పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : శుక్రవారం కైలాస్ నగర్ లోని అశోక బుద్ధ విహార్లు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ముందుగా బౌద్ధ వందనం సమర్పించారు. రూ:60 లక్షల నిధులు వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బౌద్ధ సమాజం పేదలకే కాకుండా మిగతా వారికి కూడా ఉపయోగపడే విధంగా మంచి కమ్యూనిటీ హాల్ ఉపయోగంలోకి రావాలని ఆకాంక్షించారు. అనేక సంవత్సరాలుగా బుద్ధ విహార్లు పెండింగ్లో లో అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. ఈ పనులు త్వరగా పూర్తయ్య విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు

## బొమ్మరిల్లు కాలనీలో వనమహోత్సవం సందర్భంగా 150 మొక్కలు నాటిన స్థానికులు.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ పట్టణంలోని బొమ్మరిల్లు కాలనీలో వనమహోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానికులు పలు రకాల మొక్కలను నాటారు. కాలనీ అధ్యక్షుడు పోచయ్య నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థి రిదాన్ సాయి, భూషణ్, రవీందర్ రెడ్డి, సంపత్ కుమారులు తదితరులు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 150 మొక్కలు నాటారు. కాలనీలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం సాగింది. స్థానికులు ఈ తరహా కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని సంకల్పించారు.



## తన రచనలతో సమాజాభివృద్ధికి కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి సాహితివేత్త అన్న బాహు సాటే అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు



పూలమాల వేస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ శుక్రవారం అన్న బాహు సాటే జయంతి సందర్భంగా ఆదిలాబాద్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అన్న బాహు సాటే జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా ఆయనకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్తానన్నారు.. అనంతరం మాంగ్ సమాజ్ సభ్యులు తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు

## కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ బహిరంగ చర్చకు సిద్ధమా.

### సవాల్ విసిరిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి



ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ ఆగస్టు 1 యూరియా పంపిణీ పై అసత్య ఆరోపణలు చేస్తూ అబద్ధపు ప్రచారాలతో కోరుట్ల నియోజకవర్గం రైతాంగాన్ని అయోమయానికి గురిచేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు నిన్న పత్రిక ముఖంగా విసిరిన సవాల్ ను స్వీకరించి, ఆగస్టు 2 అంటే రేపు శనివారం కోరుట్ల మండలం ఐలాపూర్ రైతు వేదిక వద్దకు బహిరంగ చర్చకు రావలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు, వైస్ చైర్మన్ ఏలాల వెంకటరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బాస శ్రావణ్, %ంష% సెల్ మండల అధ్యక్షులు దుదిగమ గంగాధర్, ఎక్స సిడిసి చైర్మన్ వెల్మల సుగునాకర్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దామెర శ్రీనివాస్,తిప్పిరి అశోక్, బోల్లవెని శంకర్, గుమ్మాల రమేష్ పాల్గొన్నారు ..

## ప్రభుత్వ టీచర్లకు ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్

### నేడు యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఉపాధ్యాయులు




మెట్టుపల్లి అమృత్ తెలంగాణ ఆగష్టు1 ప్రభుత్వ విద్యాసంస్థల్లోని టీచర్లకు ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం ఎఫ్ ఆర్ ఎస్ అమలు చేయాలని విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్కూళ్లలో ఉపాధ్యాయులు తమ చరవాణిలో ఫోటో అప్లోడ్ చేసుకుని ప్రధానోపాధ్యాయులు లాగిన్ లో వివరాలు నమోదు చేసుకున్నారు, తరువాత ఉపాధ్యాయులు తమ ఫోటో ఆధారంగా ఎఫ్ ఆర్ ఎస్ హాజరు నమోదు చేసుకున్నారు, మొదటిరోజు కావడంతో నెట్ ప్రాబ్లం వల్ల కొంత ఆలస్యంగా నైనాతమ హాజరునునమోదు చేసుకున్నారు, కానీ నెట్ లేని ప్రాంతంలో ఉపాధ్యాయులు సమస్యలను ఎదుర్కొన్నారు,మెట్టుపల్లి చావిడి వద్ద గల నూతనఉన్నత పాఠశాలలోఉపాధ్యాయులుతమచరవాణిలో హాజరు నమోదు చేసుకున్నారు,

## ఆదిలాబాద్.. పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్య



ఆదిలాబాద్ టౌన్ :అమృత్ తెలంగాణ: పరీక్షలో ఫెయిల్ అయ్యానన్న బాధతో మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు 1 టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని శాంతి నగర్ కాలనీకి చెందిన రిత్విక్ (17) ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలు ఇటీవల విడుదల కాగా అందులో ఐదు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. దింతో మనస్తాపానికి గురై ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తండ్రి భూమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## దేవాలయాల నిధుల మంజూరుకు టెండర్ పూర్తి.... హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు...



దేవాలయ నిధుల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి నీ సన్మానిస్తున్న మొగిలి గ్రామస్తులు

నిర్మల్ జిల్లా బైంసా దేగం ఆగస్టు 1 అమృత్ తెలంగాణ మాజీ ఎమ్మెల్యే జి విఠల్ రెడ్డి, నివాసంలో తానూరు మరియు మహాలింగి మరియు మొగిలి గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను కలవడం జరిగింది. దేవాలయాల యొక్క టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కు నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కు మరియు ముధోల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి,కి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ లికాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాల యొక్క అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి దేవాలయాల యొక్క అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంకు మా గ్రామస్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు రాజన్న,ఉత్తమ్ బాలేరావు, మాజీ ఆత్మ చైర్మన్ పోత రెడ్డి, మాజీ సర్పంచులు పుండలిక్, లచ్చన్న, పోశెట్టి, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం తానూర్ మండల అధ్యక్షులు ధర్మోడ్ సుభాష్ గ్రామ కమిటీ అధ్యక్షులు దొంతులవారు సాయినాథ్ ప్రధాన కార్యదర్శి కారగిరి నరసయ్య టెంపుల్ అధ్యక్షులు చింతలూరు లక్ష్మణ్ చోటే వాడు గణేష్ సరస్వతి పండరి గణేష్ బాలాజీ,సాయినాథ్, దర్శన్,మోహన్ గంగాధర్, రాజు, బాబురావు, సుభాష్, గణేష్, మల్లేష్, వెంకట్,మహాలక్ష్మి దేవాలయం టెంపుల్ చైర్మన్ పోశెట్టి, క్యాషియర్ శివాజీ,కండే రావు పాటిల్, కృష్ణ మరియు యాదవ సంఘం నాయకులు మరియు వీడీసీ పెద్ద మనుషులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ మున్సిపాలిటీల అభివృద్ధికి నిరంతరం స్పష్టమైన ప్రణాళికతో కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కాల్యాలయంలో పారిశుధ్యం, పన్నుల వసూలు, మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్లు, పట్టణ సుందరీకరణ, తదితర అంశాలపై మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాణిజ్య, వ్యాపార, ప్రకటనల, తదితర పన్నులు అన్నింటిని సకాలంలో వసూలు చేయాలన్నారు. వార్డుల్లో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహించాలన్నారు. వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. నీటి సరఫరాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పట్టణంలో కీలకమైన కూడళ్ళలో సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు అధికారులంతా సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అవసరమైన అన్ని ఎరువులను అందుబాటులో ఉంచాలి: -జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి శుక్రవారం సారంగాపూర్ మండలం చించోలి.బి గ్రామంలోని డిసిఎంఎస్ ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో ఏర్పాటు చేసిన స్టాక్ బోర్డును పరిశీలించారు. తప్పకుండా ప్రతిరోజు రైతులకు ఎరువుల దుకాణంలో అందుబాటులో ఉన్న యూరియా ఇతర ఎరువుల వివరాలు అర్థమయ్యేలా స్పష్టంగా స్టాక్ బోర్డులను ప్రదర్శించాలన్నారు. ఎరువులు అమ్మకానికి సంబంధించి రసీదులను తనిఖీ చేశారు. అన్ని రసీదులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ, గడువు తీరిన ఎరువులను విక్రయించవద్దని హెచ్చరించారు. గ్రామానికి చెందిన పలువురు రైతులతో మాట్లాడుతూ, రైతులు సాగు చేస్తున్న పంటలు, వారికి అవసరమైన ఎరువుల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఫర్టిలైజర్ దుకాణాలలో అన్ని పంటలకు సరిపడిన మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని వారికి చెప్పారు. ఎరువుల విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని అన్నారు. పంటలకు అవసరమైన మోతాదులో మాత్రమే ఎరువులను వేయాలన్నారు. అధిక యూరియా వేయడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందనేది అపోహ మాత్రమే అని చెప్పారు. అధిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుందని వివరించారు. అనంతరం సారంగాపూర్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణంలోని స్టాక్ బోర్డును పరిశీలించారు. యూరియా, డిఏపి అమ్మకాలకు సంబంధించిన రసీదులను పరిశీలించి, ప్రతి అమ్మకానికి సంబంధించిన రసీదును సంబంధిత రైతుకు కచ్చితంగా అందించాలని అన్నారు. పురుగుల మందు లేబుళ్లను పరిశీలించి, గుర్తింపు పొందిన సంస్థలు తయారు చేసే పురుగుల మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని అన్నారు. గడువు తీరిన, నకిలీ మందులను విక్రయించవద్దని అన్నారు. సంబంధిత అధికారులు అంతా ఎప్పటికప్పుడు ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



జన్నారం :అమృత్ తెలంగాణ: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, జన్నారం స్కూల్ కాంప్లెక్స్ టీచర్స్ మీటింగ్ పిఓ,ఐటీడీఏ, ఉట్నూర్ ఆదేశాల మేరకు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జిల్లా అధికారులు నూతనంగా నియమింపబడిన ఎస్ సి ఎం ఓ లక్ష్మయ్య, మంచిర్యాల సమక్షంలో నిర్వహించారు.

ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ శివరాజం మాట్లాడుతూ టి డబ్ల్యూ పిఎస్ ఉపాధ్యాయులందరూ పాఠశాల ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేయాలని, సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏసీఎంవో మాట్లాడుతూ విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, వారికి సరైన విద్యను అందించాలని, టి డబ్ల్యూ పిఎస్ ఉపాధ్యాయుల అటెండెన్స్ రోజులో మూడుసార్లు జిపిఎస్ ఫొటోస్ ద్వారా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు.

నాణ్యమైన విద్యతో పాటు మంచి పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందజేయాలని పై అధికారుల ఆదేశాలను తూ. చ తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ ఎస్సీఆర్పి శ్రీ రఘునాథం, సి ఆర్ పి బుచ్చన్న, జన్నారం దండపెల్లి మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాణ్యమైన మొహువా లడ్డు లు అందించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా, శాసన సభ్యులు కోవ లక్ష్మి



నార్నూర్ మండలం అస్పరేషనల్ బ్లాక్ ఖైర్ ద్వాట గ్రామం లోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించి విద్యార్థులు ఇంగ్లీష్ లో మాట్లాడించి అభ్యాస సామర్థ్యాల ను పరిశీలించి తగు సూచనలు సలహాలు చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నార్నూర్ మండలం అస్పరేషనల్ బ్లాక్ ఖైర్ ద్వాట గ్రామం లో శుక్రవారం మొహువా లడ్డు యూనిట్ ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆసిఫాబాద్ MLA కోవ లక్ష్మి తో కలసి ప్రారంభించారు.



అస్పరేషనల్ బ్లాక్ నార్నూర్ మండలం లోని chc వందపడకల ఆసుపత్రి ఆవరణలో కమ్యూనిటీ ఆర్వో ప్లాంట్ యూనిట్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆసిఫాబాద్ ఎంఎల్ఏ కోవ లక్ష్మి.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : నార్నూర్ మండలంలోని ఖైర్దత్వట గ్రామంలో ఏర్పాటు చేసిన మొహువా లడ్డు తయారీ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా IAS , ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి శుక్రవారం రోజు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద రూ. 6 లక్షల గ్రాంట్ ద్వారా మొహువా లడ్డు మిషన్, పుల్వరైజర్ మిషన్, తుకడా మిషన్, డఫ్ మిషన్ లాంటి మిషనరీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మిషనరీల సాయంతో రుచికరమైన, నాణ్యమైన లడ్డులను తయారు చేసి KGBV హాస్టల్స్, ఇతర ప్రభుత్వ హాస్టల్స్ మరియు మార్కెట్‌లకు సరఫరా చేయాలని పేర్కొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ, "గిరిజనులు తయారు చేస్తున్న మొహువా లడ్డులు ఎంతో రుచికరంగా ఉన్నాయని , ఆరోగ్య పరిరక్షణకు అనుగుణంగా, నాణ్యమైన ప్రమాణాలతో లడ్డులను తయారు చేయాలి," అని సూచించారు. లడ్డులు తయారు చేసే ఉత్పత్తిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, DRDO రాథోడ్ రవీందర్, ZP CEO జితేందర్ రెడ్డి, APD గోవింద్ రావు, MRO రాజలింగు, MPDO గంగాసింగ్, ఏపీఎం మైస్ రమేష్, మొహువా లడ్డు యూనిట్ సభ్యులు మాదవి

# రౌడీయిజానికి పాల్పడుతున్న వ్యక్తిపై పిడి యాక్ట్ నమోదు - ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి.

నిందితుడు షేక్ సలీం ఏ క్రైంచి సలీం (బంగారిగూడ) అరెస్టు, చంచలగూడ జైలుకు తరలింపు.

షేక్ సలీం ఏ క్రైంచి సలీం పై హత్య, రౌడీయిజం, కిడ్నాప్, బెదిరింపుల కేసులలో ప్రధాన నిందితుడు.

ఆదిలాబాద్ వన్ టౌన్, రూరల్, మావల పోలీస్ స్టేషన్లో ఇతనిపై 8 కేసులు నమోదు.

పదేపదే వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఏర్పాటు, పిడి యాక్ట్ నమోదు.

గంజాయి తరలిస్తూ, వ్యాపారం చేస్తూ ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : రౌడీయిజం చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతూ, మారనాయుధాలతో పబ్లిక్ స్థలాలలో విన్యాసాలు చేస్తూ, తీసిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న షేక్ సలీం (30) ఏ క్రైంచి సలీం పై పిడి యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేసి చంచల్ గూడా జైలుకు తరలించడం జరిగిందని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలియ చేశారు. నిందితునిపై ఇదివరకే ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో పోలీస్ స్టేషన్లో 8 కేసులలో ప్రధాన నిందితుడుగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో హత్య కేసు, రూరల్ పోలీస్ స్టేషన్ నందు(6 కేసులు) మారణాయుధాలతో విన్యాసాలు చేస్తు ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్న కేసు, ఆటో డ్రైవర్ ని కిడ్నాప్ చేసి రూమ్ లో బంధించి బాధితుని బట్టలు విప్పదీసి, మూకుమ్మడిగా దాడి చేసి వీడియోలు తీసి విచక్షణారహితంగా కొట్టిన సందర్భంలో పలు కేసులు నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యంగా సెటిల్మెంట్లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ వేధించిన సందర్భాలలో ఇతనిపై కేసు నమోదు అవ్వడం జరిగిందన్నారు. చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమేనని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తప్పు చేసిన వారిపై జిల్లా పోలీసు యంత్రాంగం కఠిన చర్యలతో పీడీ యాక్ట్ సైతం నమోదు చేయడానికి వెనకాడ బోధని తెలిపారు. అదేవిధంగా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వారిపై, రౌడీయిజం చేసే వారిపై గంజాయి స్మగ్లర్లు, అమ్మేవారిపై తగు చర్యలను తీసుకుంటుందని తెలిపారు. నిందితుడు షేక్ సలీం ఏ క్రైంచి సలీం 2019 సంవత్సరంలో హత్య కేసు 2025 సంవత్సరం రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఆమ్స్ యాక్ట్ కేసులు, రౌడీయిజం కేసు నమోదు అయినాయని తెలిపారు. ప్రవర్తన మార్చుకొని రౌడీలు, వ్యవస్థీకృత నేరాలు చేసే వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి పరిశీలించడం జరుగుతుందని అదేవిధంగా నేరాలకు పాల్పడుతున్న వారిపై పిడి యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ అరెస్టు లో ఆదిలాబాద్ రూరల్ సీఐ కె ఫణిదర్, రూరల్ ఎస్ఐ విష్ణు వర్ధన్ పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం.

సమిష్టి కృషితోనే బాల కార్మికుల వ్యవస్థ జిల్లాలో పూర్తిగా నాశనం.

బాలలు బడులకి అంకితం కావాలని జిల్లా పోలీసుల పిలుపుతో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

జిల్లా లో 93 మంది బాల కార్మికులకు విముక్తి.

జిల్లావ్యాప్తంగా 28 కేసుల నమోదు

86 బాలురు,7 బాలికలను రక్షించిన యంత్రాంగం.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ ముస్కాన్ పేరుతో నెలరోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 93 మంది బాలలను రక్షించి తల్లిదండ్రులకు మరియు వసతి గృహాలకు చేర్చి బాల కార్మికుల వ్యవస్థను నాశనం చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ ను విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఆపరేషన్ ముస్కాన్ నందు జిల్లావ్యాప్తంగా 93 మంది పిల్లలను రక్షించినట్టు అందులో 70 మంది పిల్లలను తల్లిదండ్రులకు 23 మంది పిల్లలను వసతి గృహాలకు తరలించి సొంత వారికి అప్పగించినట్లు తెలిపారు. 93 మంది పిల్లలలో 86 మంది బాలురు ఏడుగురు బాలికలు ఉన్నట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 28 కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల వారు ఇందులో 26 మంది ఉన్నట్లు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా జిల్లా వెల్ఫేర్ కమిటీ కార్మిక శాఖ, విద్యాశాఖ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, వైద్య శాఖ, మరియు ఎన్జీవోల సహకారంతో జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ ను విజయవంతం చేసి బాల కార్మికులను గుర్తించి తగు చర్యలను తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా రెస్క్యూ చేసిన వారిలో హోటల్లలో, భవన నిర్మాణాలలో, ఇటుక బటీలలో పనులలో ఉన్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అందజేసి అవగాహన కల్పించడం జరిగిందని బాలలను బడులకు పంపాలని తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల వారికి విడతలవారీగా వారి సొంత స్థలాలకు చేర్చి తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. చట్ట ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెల రోజులపాటు కొనసాగిన ఈ ఆపరేషన్ ముస్కాన్ తో ఆగకుండా సంవత్సరం పాటుగా బాల కార్మికులు కనబడినట్లయితే వెంటనే డయల్ 100 ద్వారా తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ



శాసనసభ్యులు కోవా లక్ష్మి రిబ్బన్ కట్ చేస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ : శుక్రవారం నార్నూర్ మండలం భీంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు సర్ సివి రామన్ సైన్స్ ల్యాబ్ ను జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ ,ఉట్నూర్ సబ్ కలెక్టర్ ,జిల్లా విద్యాశాఖాధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మీ ప్రారంభించారు . జిల్లా కలెక్టర్ నార్నూర్ మండలంనుఆస్పిరేషన్ బ్లాక్ గా తీసుకున్న సందర్భంలో పాఠశాలల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నార్నూర్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బీంపూర్ పాఠశాలకు రూపాయలు 2, 74,000 రూపాయలు రెండు లక్షల డెబ్బై నాలుగు వేలు ప్రతి పాఠశాలకు గాను మంజూరు చేశారు. దీనికి గాను ఈరోజు భీంపూర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ను ఘనంగా ప్రారంభించి, విద్యార్థులు సైన్స్ పట్ల పరిశోధన పట్ల ఆసక్తి పెంచుకోవాలని మునుముందు శాస్త్రవేత్తలుగా తయారు కావాలని శాసన సభ్యులు కోవ లక్ష్మి ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రయోగాన్ని తమ చేతుల ద్వారా నేర్చుకున్నప్పుడే జీవితాంతం గుర్తుండిపోతుంది అని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ గ్రంథాలయ కమిటీ చైర్మన్ మల్లెపూల నరసయ్య జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి , మండల విద్యాశాఖ అధికారి పవార్ అనిత పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సి ఆర్ పి లు మరియు పాఠశాల పోషకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# నార్నూర్ అస్పరేషనల్ బ్లాక్ నీతి ఆయోగ్ రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ అవార్డు అందుకోనున్న అదిలాబాద్ జిల్లా పాలనాధికారి రాజర్షి షా







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ SERP తెలంగాణ ఆగస్టు 02, 2025న హైదరబాద్ లోని రాజ్ భవన్ లో జరగనున్న "సంపూర్ణత అభియాన్ రాష్ట్ర స్థాయి అవార్డును అదిలాబాద్ జిల్లా పాలనాధికారి రాజర్షి షా అందుకోనున్నారు. సంపూర్ణ అభియాన్ రాష్ట్ర స్థాయి అవార్డుల కార్యక్రమం 2025 ఆగస్టు 02 (శనివారం) సాయంత్రం 04:00 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్ భవన్ లోని దర్బార్ హాల్ లో జరగనున్న సంపూర్ణ అభియాన్ యొక్క వివిధ పారామితుల కింద సంతృప్తిని సాధించడంలో జిల్లాల అత్యుత్తమ సహకారాన్ని గుర్తించి, సత్కరించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణ గవర్నర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి, ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలకు అవార్డులను ప్రదానం చేస్తారు..

ఈ సందర్భంగా నార్నూర్ బ్లాక్

సంపూర్ణత అభియాన్ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ABP బ్లాకులలో జూలై 2024 నుండి సెప్టెంబర్ 2024 వరకు ఆరోగ్యం, పోషణ, వ్యవసాయం మరియు సామాజిక అభివృద్ధికి సంబంధించిన ఆరు సూచీలలో పూర్తి సంతృప్తి సాధించడానికి ప్రారంభించబడింది.

నార్నూర్ బ్లాక్ ఈ ఆరు సూచీలలో విజయవంతంగా పూర్తి సంతృప్తి సాధించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని, మూడు లేదా అంతకంటే ఎక్కువ సూచీలలో సంతృప్తి సాధించిన కలెక్టర్లను సత్కరించేందుకు నీతి ఆయోగ్ రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ ను నిర్వహిస్తోంది.

ఆరు సూచీలలో పూర్తి సంతృప్తి సాధించి స్వర్ణ పురస్కారం అందుకున్న తెలంగాణలోని ఏకైక బ్లాక్ అదిలాబాద్ జిల్లా నర్నూర్ బ్లాక్. ఈ పురస్కారాన్ని రేపు ఆగస్టు 2 న రాజ్ భవన్‌లో గౌరవనీయ గవర్నర్ అందజేస్తా

# లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డుల పత్రాలను అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఇంద్రవెల్లి మండలం అంజి రోడ్ లోని కాగానే ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఖానాపూర్ నియోజకవర్గం ఇంద్రవెల్లిలో దాదాపు 9 వేల, సిరికొండ 251, మండలాల అర్హులైన లబ్ధిదారులకు ప్రజా పాలన ప్రగతి బాట ఆహార భద్రత, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం లో లబ్దిదారులకు అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు. అనంతరం కూరగాయల విత్తనాల ప్యాకెట్స్ ను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బు గుప్తా, లైబ్రరీ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ ఛైర్మెన్ ఆర్డీవోస్రవంతి,MROఎంపిడిఓ,రెవెన్యూ , పౌరసరఫరాల శాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ ట్రస్టు తనిఖీలు



కంఠేశ్వర్ :అమృత్ తెలంగాణ: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలో గల మెడికవర్ ఆస్పత్రిని ఆరోగ్య శ్రీ ట్రస్టు అధికారులు తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ జీఎం డా. రాంబాబు నాయక్ ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ ట్రస్టు సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ లో జరుగుతున్న వైద్యంలో ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా అని రోగులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మెడికవర్ లో ఆరోగ్య శ్రీ సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో డిప్యూటీ ఈఓ శ్రీనివాస్, చంద్రశేఖర్, మేనేజర్ ఆర్. సత్యనారాయణ, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యుల భర్తీ



నిజామాబాద్ .అమృత్ తెలంగాణ: ప్రభుత్వ వైద్య కళాశాల నిజామాబాద్ నందు ఖాళీగా ఉన్నటువంటి ప్రొఫెసర్-3, అసోసియేట్ ప్రొఫెసర్-5, అసిస్టెంట్ ప్రొఫెసర్-31, ట్యూటర్-5, సీనియర్ రెసిడెంట్-24 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అదనపు డిఎంఈ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టుల దరఖాస్తుల స్వీకరణ ఈనెల 11 వరకు సాయంత్రం 4 గంటల వరకు పని దినాలలో దరఖాస్తులను ప్రభుత్వ వైద్య కళాశాల నిజామాబాద్ కార్యాలయంలో స్వీకరించబడును అని అన్నారు. దరఖాస్తు చేసుకున్నా అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొరకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు ఈనెల 13 న సమయం 11 గంటలకి ప్రభుత్వ వైద్య కళాశాల నిజామాబాద్ కార్యాలయంలో హాజరు కాగలరు అని, ఈ పోస్టుల సెలక్షన్ కొరకు వాకిన్ ఇంటర్వ్యూ ఈనెల 14.న సమయం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల నిజామాబాద్ కార్యాలయం నందు హాజరు కాగలరు అని అన్నారు. మరిన్ని వివరాల కొరకు కళాశాల వెబ్సైట్ www.gmcnzh.org ను సంప్రదించాలని సూచించారు.

# లోకేష్ వ్యాఖ్యలతో అసలు లోగుట్టు బయటపడింది..

కమ్మర్ పల్లి :అమృత్ తెలంగాణ: బనక చర్ల ప్రాజెక్ట్ ఎలాగైనా కట్టి తీరుతాం అంటున్న లోకేష్ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ నాయకులు ఇప్పటిమట్టుకు స్పందించకపోవడంతో అసలు లోగుట్టు బయట పడిందని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బనక చర్ల ప్రాజెక్ట్ ను బీజేపీ కేంద్ర ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు పథకం ప్రకారం ముందుకు తీసుకుపోతున్నట్టుగా లోకేష్ వాక్యలతో అర్థం అవుతున్నదన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం, చంద్రబాబు కలిసి చేసే ఈ నాటకంలో రేవంత్ రెడ్డిని పావులాగా వాడుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

బనక చర్ల ప్రాజెక్ట్ పై చంద్రబాబు, లోకేష్ వ్యాఖ్యలు.. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ, తెలంగాణ బిజెపి నాయకుల చేతకాని తనానికి నిదర్శనం అన్నారు.

బనక చర్ల మీద చర్చ కోసం ఢిల్లీ కి పోను అని పగలు చెప్పి, రాత్రికి రాత్రి మనసు మార్చుకొని ఢిల్లీకి వెళ్లి బనక చర్ల మీద వేసిన కమిటీని ఒప్పుకోవడంలో ఆంతర్యం ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బనకచర్ల ఎజెండాలో లేదు.. కడుతం అంటే కదా అడ్డు చెప్పేది అని మాట్లాడిన రేవంత్ రెడ్డి మంత్రి లోకేష్ మాట్లాడిన మాటలపై నీ నోరు ఎందుకు పెగలటం లేదన్నారు. రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబు మెప్పుకోసం, కేంద్రం దగ్గర తన స్వప్రయోజనాల కోసం తెలంగాణను తాకట్టు పెడుతున్నాడని విమర్శించారు. మాయల ఫకీర్ ప్రాణం చిలకలో ఉన్నట్టు నోటుకు ఓటు కేసులో నిందితుడు అయిన రేవంత్ రెడ్డి జుట్టు చంద్రబాబు,బిజెపి చేతిలో ఉన్నదన్నారు. అందుకే తనను తాను కాపాడుకోవడానికి బనకచర్ల విషయంలో చంద్రబాబు, బీజేపీ లకు వత్తాసు పలుకుతూ రేవంత్ రెడ్డి తెలంగాణ కు తీరని



అన్యాయం చేస్తున్నాడన్నారు.

బిజెపి నుండి 8 మంది ఎంపిలను గెలిపించినా, తెలంగాణకు కేంద్రం చేస్తున్న అన్యాయంపై ఒక్కరు కూడా మాట్లాడటం లేదని,పదవుల కోసం పెదవులు ముసుకున్నారని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణకు అన్యాయం చేసే బనక చర్ల ప్రాజెక్ట్ ను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎల్లప్పుడూ పోరాడేది కేసీఆర్, బిఆర్ఎస్ పార్టీ మాత్రమేనని,ఏనాటికైనా తెలంగాణ కు కేసీఆర్ శ్రీరామ రక్ష అన్నారు. బనక చర్ల ప్రాజక్ట్ విషయంలో బీజేపీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి ముగ్గురు కలిసి తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని తెలంగాణ వ్యాప్తంగా ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు.

# ప్రవాసీ ప్రజావాణిని సందర్శించిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ గౌరవ సభ్యులు, ఎమ్మెల్యే

డిచ్ పల్లి : అమృత్ తెలంగాణ: గల్ఫ్ కార్మికులకు, ఎన్నారైలకు కష్టమొస్తే ఇక్కడ హైదరాబాద్ లో ప్రతి మంగళవారం, శుక్రవారం ప్రవాసీ ప్రజావాణిలో చెప్పుకోవచ్చని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, ఎన్నారై అడ్వయిజరీ కమిటీ గౌరవ సభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్టంలో లేని విధంగా తెలంగాణాలో ప్రవాసీ ప్రజావాణిని ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన అన్నారు. హైదరాబాద్ బేగంపేట ప్రజా భవన్ లో శుక్రవారం జరిగిన ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొని గల్ఫ్, యూకే, ఆస్ట్రేలియా ప్రవాసీ కుటుంబాలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం ప్రజావాణి



ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్. జి. చిన్నారెడ్డి తో సమావేశమై పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీం రెడ్డి, మెంబర్లు నంగి దేవేందర్ రెడ్డి, సిస్టర్ లిజీ జోసెఫ్, ఎన్నారైలు రంగుల సుధాకర్ గౌడ్ (యూకే,), అమరేందర్ బొజ్జ (అమెరికా), గుండేటి గణేష్, శ్రీ నూనె లక్ష్మణ్ యాదవ్ (ఓమాన్), వలస కార్మిక హక్కుల నాయకులు బి. ఎల్. సురేంద్రనాథ్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రైడే డ్రై డేలో పాల్గొన్న ఎంపీడీఓ



మాక్లూర్ :అమృత్ తెలంగాణ: మండల కేంద్రంలోని ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో మండల ఎంపీడీఓ బ్రహ్మానందం రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. గ్రామంలోని ఇండ్లలో నీటి నిల్వలను చూసి వాటిని క్రింద పోయించారు. ప్రతి శుక్రవారం డ్రై డే ను పాటించడం ద్వారా విష జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ఎంపీడీఓ యం. బ్రాహ్మానందం పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా వ్యాధులు ఎలా అరికట్టవచ్చని ప్రజలకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. అనంతరం ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజుల కొకసారి మార్చాలని, ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో వుంచకుండా చూడాలని సూచించారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి: సీఐటీయూ

మద్నూర్ : అమృత్ తెలంగాణ: మద్నూర్ మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ధర్నా నిర్వహించి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, జిల్లా నాయకులు సురేష్ గొండ పాల్గొని మాట్లాడుతూ .. మండలంలోని వివిధ పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరి ముఖ్యంగా 9 నెలల నుండి కోడిగుడ్ల బిల్లులు, ఐదు నెలల పెండింగ్ వేతనాలు, కూరగాయల బిల్లులు, ఇతర కిరాణా సామాన్ బిల్లులు లేక కార్మికులు, కిరాణా షాప్ యజమాన్యం దగ్గర ఉద్దెర సామాన్ల కొరకు, తమ దగ్గర ఉన్న, బంగారము, పుస్తెలతాడులు, కొన్నిచోట్ల తాకట్టు పెట్టి వడ్డీ కింద కిరాణా సామాన్లు తెచ్చి, తమ గ్రామాల్లో ఉన్న పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు మంచి భోజనాలు అందిస్తూ సేవలు చేస్తున్న వీరికి నెలల తరబడి. బిల్లులు రాక. వేతనాలు రాక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పటికైనా ఈ రెండు మూడు రోజుల్లో బిల్లులు రాకుంటే, హైదరాబాద్ లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముందు 6న ధర్నా నిర్వహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు, సురేష్ గొండ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మిక సంఘం, జిల్లా కార్యదర్శి, సరస్వతి, మద్నూర్ మండల



అధ్యక్షురాలు, సావిత్రి, డోంగ్లి మండల అధ్యక్షురాలు, వచల బాయ్, మండల కార్యదర్శి, ఫర్జానా, ఉపాధ్యక్షురాలు, లాలాబాయి, సహాయ కార్యదర్శి, మొగులవ, కార్మికులు, రేఖ భాయ్,సారుభాయ్,ద్రౌపత భాయ్, మద్నూర్ మండలంలోని డోంగ్లి, మండలంలోని వివిధ పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు నాయకులు పాల్గొన్నారు.

# హిట్ బ్యూటీ నడుము నాభి అందాలతో మతి పోగొడుతోంది బాబోయ్



ఇచట వాహనాలు నిలుపరాదు సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయిన అందాల ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి 2022 లో హిట్ 2 తో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం తమిళ సినిమాలో నటిస్తున్న ఈ అమ్మడు ముందు ముందు తెలుగు లో మరిన్ని సినిమాలు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ అందాల ముద్దుగుమ్మ 2018 సంవత్సరంలో ఫెమినా మిస్ ఇండియా గా ఎంపిక అయిన విషయం తెల్సిందే. అందాల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు ఎక్కువ శాతం హీరోయిన్స్ గా రాణించలేకపోయారు. కొద్ది మంది మాత్రమే బాలీవుడ్ లో సెటిల్ అయ్యారు. ఇప్పుడు వారిలో మీనాక్షి చౌదరి కూడా నిలిచింది. మీనాక్షి చౌదరి సినిమాల్లో అందాల విందు చేసినా చేయకున్నా సోషల్ మీడియాలో మాత్రం ఓ రేంజ్ లో అందాల విందు చేస్తూ ఉంటుంది. క్లీ వేజ్ షో మొదలుకుని థైస్ ఎక్స్ పోజ్ చేస్తూ నడుము నాభి అందాలను చూపించే వరకు అన్ని విషయాల్లో కూడా ఆమె ముందు ఉంటుంది అంటూ గత ఫొటోలు చూస్తే అర్థం అవుతుంది. తాజాగా మరోసారి మీనాక్షి ఈ ఫొటోలో నడుము నాభి అందాన్ని చూపిస్తూ కుర్రకారును రెచ్చగొడుతోంది. ఇక ఈ అమ్మడి యొక్క క్లీ వేజ్ షో కు మతిపోయినంత పని అవుతుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఈ స్థాయిలో అందాల విందు చేస్తే బాలీవుడ్ లో భవిష్యత్తులో చక్రం తిప్పడం ఖాయం అంటూ మీనాక్షి చౌదరి గురించి నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# తమన్నాని ఇంకా వదలట్లేదు..!


బాలీవుడ్ యాక్షన్ హీరో అజయ్ దేవగన్ చేస్తున్న రైడ్ 2 సినిమాలో తమన్నా స్పెషల్ సాంగ్ చేసిందట. రెండు దశాబ్దాల తర్వాత కూడా తన ఫాం కొనసాగిస్తూ హంగామా చేస్తుంది మిల్కీ బ్యూటీ తమన్నా. అమ్మడు ఇప్పటికి కూడా వరుస సినిమాలు చేస్తూ ఫ్యాన్స్ ని అలరిస్తుంది. త్వరలో ఓదెల 2 తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న తమన్నా అటు బాలీవుడ్ లో కూడా అవకాశాలు అందుకుంటుంది. లేటెస్ట్ గా అమ్మడు బీ టౌన్ క్రేజీ సీక్వల్ లో స్పెషల్ సాంగ్ ఆఫర్ అందుకుందని టాక్. బాలీవుడ్ యాక్షన్ హీరో అజయ్ దేవగన్ చేస్తున్న రైడ్ 2 సినిమాలో తమన్నా స్పెషల్ సాంగ్ చేసిందట. డబ్బు తీసుకుని డేట్స్ ఇవ్వలేదంటూ హీరోపై నిర్మాణ సంస్థ ఫైర్ సౌత్ లో కూడా తమన్నా చాలా స్పెషల్ సాంగ్స్ చేసింది. స్టార్ హీరోయిన్ గా ఉంటూ ఐటం సాంగ్స్ చేసిన హీరోయిన్స్ లో తమన్నా ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంది. అదే విధంగా ఇప్పటికీ బాలీవుడ్ లో తమన్నా స్పెషల్ సాంగ్స్ చేస్తుంది. అజయ్ దేవగన్ రైడ్ 2లో తమన్నా సాంగ్ స్పెషల్ ఎట్రాక్షన్ కాబోతుందని తెలుస్తుంది. ఐతే



సినిమాలో ఈ సాంగ్ ను విజయ్ గంగూలి కంపోజ్ చేసినట్టు తెలుస్తుంది. తమన్నా చివరగా బాలీవుడ్ లో స్త్రీ 2 లో స్పెషల్ సాంగ్ చేసింది. రైడ్ 2 లో మరోసారి అమ్మడు తన సాంగ్ తో సర్ ప్రైజ్ చేయనుంది. రైడ్ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో ఆ సినిమా సీక్వె తో మరో క్రేజీ అటెంప్ట్ చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాను రాజ్ కుమార్ గుప్తా డైరెక్ట్ చేశారు. సినిమా మే 1న రిలీజ్ ప్లాన్ చేశారు. రైడ్ సినిమాను తెలుగులో రవితేజ మిస్టర్ బచ్చన్ గా రీమేక్ చేశాడు. కానీ ఆ సినిమా తెలుగు ఆడియన్స్ ని మెప్పించలేకపోయింది. ఐతే రైడ్ 2 సినిమాను తెలుగులో రీమేక్ చేసే ఛాన్స్ లు ఉన్నాయా అంటే కష్టమే అన్నట్టు పరిస్థుతులు కనబడుతున్నాయి. ఐతే రిలీజ్ తర్వాత నిజంగానే పాయింట్ బాగుంటే సినిమా చేసే ఛాన్స్ లు ఉండొచ్చు. ఇక కెరీర్ పరంగా తమన్నా మాత్రం వచ్చిన ఏ చిన్న ఛాన్స్ ని వదలట్లేదు. ఐతే కెరీర్ ఇలా ఉంటే అమ్మడు పర్సనల్ లైఫ్ లో రియల్ జోడీని ఫిక్స్ చేసుకుందని వార్తలు రాగా.. మళ్లీ వారి మధ్య దూరం పెరిగిందని టాక్. ఏది ఏమైనా 20 ఏళ్లుగా నటిగా తనను తాను ప్రూవ్ చేసుకుంటూ సక్సెస్ ఫుల్ కెరీర్ సాగిస్తుంది తమన్నా.

# సెల్ఫీ క్వీన్ ఊర్వశి భంగిమ కిల్లింగ్

ఇప్పుడు పసుపు రంగు బాడీ హగింగ్ డ్రెస్ ని తొడుక్కుని సెల్ఫీలకు ఫోజులిస్తూ కనిపించింది. నిరంతరం ఏదో ఒక ప్రత్యేక విషయంతో ఊర్వశి వార్తల్లో నిలుస్తోంది. ఇంతకుముందు వివాదాస్పద వ్యాఖ్యలతో లేదా ఐటమ్ నంబర్లతో వెబ్ లో చర్చగా మారింది. ఇటీవల వరుస ఫోటోషూట్లతో చర్చల్లోకొస్తోంది. తాజాగా ఊర్వశి రౌతేలా తన బిజీ షెడ్యూల్ నుండి కొంత సమయం తీసుకుని పేదలకు ఆహారం అందించే ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఆకలితో ఉన్నవారికి జిలేబీ వడ్డిస్తున్న వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసింది. ఊర్వశి భారీ సంఖ్యలో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసింది. ఇప్పుడు పసుపు రంగు బాడీ హగింగ్ డ్రెస్ ని తొడుక్కుని సెల్ఫీలకు ఫోజులిస్తూ కనిపించింది. ఊర్వశి నాభి అందాలను ఆవిష్కరించిన తీరు ఆకట్టుకోగా పలుచోట్ల ముత్యాలతో అలంకరణ మతులు చెడగొట్టింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. డాకు మహారాజ్ విజయంతో ఊర్వశి ప్రస్తుతం మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ వెల్కమ్ 3 తో బిజీగా ఉంది. అహ్మద్ ఖాన్ దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో అక్షయ్ కుమార్, రవీనా టాండన్, దిశా పటాని, సునీల్ శెట్టి, లారా దత్తా, బాబీ డియోల్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, పరేష్ రావల్, అర్షద్ వార్సీ, రాజ్‌పాల్ యాదవ్, జానీ లివర్, శ్రేయాస్ తల్పాడే, తుషార్ కపూర్



తదితరులు నటిస్తున్నారు. ఈ సిరీస్ లో మొదటి చిత్రం దీని తర్వాత 2015లో వెల్కమ్ బ్యాక్ వచ్చింది. దీనితో పాటు ఊర్వశి వివేక్ చౌహాన్ నటించనుంది.



# దేవకన్యలా.. మిత్రవిందగా.. బేబీ లుక్కు అదిరింది..



! అమ్మడు హీరోయిన్ గా నటించిన ఫస్ట్ సినిమానే సూపర్ హిట్ అందుకుంది. షార్ట్ ఫిలిమ్స్ తో కెరీర్ మొదలు పెట్టి ఆ తర్వాత సినిమాల్లో సైడ్ రోల్స్ చేస్తూ బేబీతో హీరోయిన్ గా సూపర్ హిట్ అందుకున్న భామ వైష్ణవి చైతన్య. అమ్మడు హీరోయిన్ గా నటించిన ఫస్ట్ సినిమానే సూపర్ హిట్ అందుకుంది. ఐతే సెకండ్ మూవీగా చేసిన లవ్ మీ సినిమా మాత్రం ఫెయిల్ అయ్యింది. అయినా సరే అమ్మడు ఏమాత్రం జోష్ తగ్గకుండా సినిమాలు చేస్తుంది. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ తో జాక్ సినిమా చేస్తుంది వైష్ణవి చైతన్య. ఆ సినిమాలో సిద్ధు తో మంచి రొమాంటిక్ ఎంటర్టైనర్ గా సినిమా చేస్తున్నట్టుగా ఉంది. బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్షన్ లో వస్తున్న సినిమా కాబట్టి వైష్ణవి చైతన్య లక్కీగా ఫీల్ అవుతుంది. ఇక సినిమాలతో పాటు సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ తో అలరిస్తుంది వైష్ణవి చైతన్య. రకరకాల ఫోటో షూట్స్ తో ఫ్యాన్స్ ని మెప్పిస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు దేవకన్యగా మారి ఫోటో షూట్ చేసింది. పండగ వైబ్ ని మరింత పెంచేలా వైష్ణవి లుక్ ఉంది. ముఖ్యంగా ఒక మహారాణి లుక్ తో కనిపిస్తుంది వైష్ణవి చైతన్య. ఈ ఫోటోలు చూసిన చాలామంది మగధీరలో మిత్రవిందకు ఏమాత్రం తీసిపోదనేలా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. నిజమే అమ్మడి ఫోటో షూట్ ప్లానింగ్స్ ఎవరు ఇస్తున్నారో కానీ యువరాణి గెటప్ లో వైష్ణవి నిజంగానే దేవకన్యలానే కనిపిస్తుంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com